

సోమవారం | 7 | సెప్టెంబర్ | 2026 ◆ పేజీలు : 5


# రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

- ముఖ్యఅతిథిగా ఆసీస్టెంట్ ఆఫ్ కమిషనర్ పోలీస్ , సైబర్ క్రైమ్ , ఖమ్మం శ్రీ సి.హెచ్. ఆర్.వి. ఫణీందర్




**ఖమ్మం అర్బన్ ప్రజా జ్యోతి: సెప్టెంబర్: 6** ఖమ్మం : రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం 3150 , ఉపాధ్యాయ దినోత్సవ సందర్భముగా మిగతా 2 లో...



# చికెన్ వ్యర్థాల దందా.. నిఘా నిద్రపోతుందా?

- గ్రామాల రహదారులే డంపింగ్ యార్డులా..?
- సుబ్లెడ్ నుంచి బచ్చోడ్ వరకు ఎక్కడ చూసినా వ్యర్థాల సమస్యపై స్థానికుల ఆందోళన
- చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఏం చేస్తున్నారు? అంటూ ప్రజల ప్రశ్నలు

**తిరుమలాయపాలెం, ప్రజా జ్యోతి సెప్టెంబర్ 06**గ్రామాల పరిశుభ్రతను కాపాడాల్సిన అధికారులు పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహిస్తున్నారా? అన్న ప్రశ్నలు మండలంలోని పలు గ్రామాల్లో వినిపిస్తున్నాయి. చికెన్ దుకాణాల నుంచి వెలువడుతున్న వ్యర్థాలను రోడ్ల వెంట, ఖాళీ ప్రదేశాల్లో పడేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నప్పటికీ సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం కనిపించడం లేదని స్థానికులు,వాహన దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హస్నాబాద్, బచ్చోడు, సుబ్లెడ్, రఘునాథపాలెం, జూపేద, కాకరవాయి తదితర గ్రామాల పరిధిలోని కొన్ని రహదారుల వెంట ఈకలు, మాంసపు అవశేషాలు, ఇతర వ్యర్థాలు కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. రోడ్డు పక్కనే వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోందని, ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని వారు అంటున్నారు.

**చికెన్ షాపులు.. వ్యర్థాలు ఎక్కడికి?**

ప్రతిరోజూ చికెన్ దుకాణాల నుంచి వ్యర్థాలు వెలువడుతున్నాయి. అయితే వాటిని సక్రమంగా సేకరించి ఎక్కడ పారవేస్తున్నారు? బహిరంగ ప్రదేశాల్లో పడేస్తున్నారా? అనే అంశంపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం

మిగతా 2 లో...

# ప్రమాదాలకు నిలయంగా బోనకల్ ప్లై ఓవర్

- మరమ్మతుల పేరుతో కాలయాపన..
- శాశ్వత పరిష్కారం ఎప్పుడు..?
- అధికారుల నిర్లక్ష్యానికి మరో ప్రాణం బలికావాలా.?



**బోనకల్, సెప్టెంబర్ 6(ప్రజా జ్యోతి ):** మండల కేంద్రంలోని జగ్గయ్యపేట–వైరా ప్రధాన రహదారిపై ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రయాణికుల పాలిట ప్రాణాంతకంగా మారుతోంది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ బ్రిడ్జిపై రహదారి దెబ్బతిని ఇనుప రాడ్లు బయటకు రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు ఈ ప్రాంతం మృత్యువుకు ఆహ్వానం పలికేలా తయారైంది. చిత్రంలో కనిపిస్తున్న పరిస్థితి చూస్తే బ్రిడ్జి నిర్వహణపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. రహదారి కింద ఉన్న ఇనుప చువ్వలు బయటకు వచ్చి, భారీ గుంతలు ఏర్పడి, ప్యాచ్ వర్క్ లు ఊడిపోయి ప్రమాదకరంగా మారినా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ బ్రిడ్జికి పలు మార్లు మరమ్మతులు చేపట్టినా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేయడం.. కొద్దిరోజులకే మళ్లీ రోడ్డు దెబ్బతినడం.. తిరిగి తాత్కాలిక పూడికలు వేయడం అనే తంతు ఎన్నాళ్లు కొనసాగిస్తారని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మరో వైపు బ్రిడ్జికి ఇరువైపులా సరైన రక్షణ కంచెలు,

మిగతా 2 లో...

# అధికారుల జవాబుదారీతనానికి ఆర్టీఐ అస్త్రం..!

- పల్లె ప్రజలు సమాచార హక్కును సద్వినియోగం చేసుకోవాలి
- ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకునే హక్కు ప్రజలదే
- ప్రశ్నించే పౌరులతోనే పారదర్శక పాలన సాధ్యం
- జింకలగూడెంలో ఆర్టీఐ కమిషనర్ పీవీ శ్రీనివాస్



**తిరుమలాయపాలెం,ప్రజా జ్యోతి, సెప్టెంబర్ 6 :** ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంలో సమాచార హక్కు చట్టం కీలక పాత్ర పోషిస్తుందని మిగతా 2 లో...

# సైన్స్ డ్రామా పోటీల బహుమతులను ప్రధానం చేసిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- జిల్లా విద్యాశాఖ అధికారి జి. సదానందం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ బహుమతులు ప్రధానం చేశారు



**ఖమ్మంప్రతినిధి:( ప్రజా జ్యోతి) సెప్టెంబర్: 6** విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం సృజనాత్మకత సమాజ అవగాహన కల్పించుటకు జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీలకు సంబంధించిన విజేతల యొక్క బహుమతుల ను జిల్లా విద్యాశాఖ అధికారి జి సదానందం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ బహుమతులను ప్రధానం చేయడం జరిగినది జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ విద్యార్థుల శాస్త్రీయ నైపుణ్యాలను పెంపొందించుటకు ఇటువంటి కార్యక్రమాల్లో ఎక్కువగా

మిగతా 2 లో...

## ప్రమాదాలకు నిలయంగా బోనకల్ ఫ్లై ఓవర్

(మొదటి పేజీ తరువాయి...)

రింగులు, డివైడర్లు, హెచ్చరిక సూచికలు లేకపోవడం ప్రమాద తీవ్రతను మరింత పెంచుతోంది. గతంలో ఇదే ప్రాంతంలో జరిగిన ప్రమాదంలో విలేకరి మంద సత్యానందం మృతి చెందడం ప్రజల మనసుల్లో ఇప్పటికీ విషాదాన్ని మిగిల్చింది. ఒక ప్రాణం పోయిన తర్వాత కూడా అధికారులు కళ్లు తెరవకపోతే మరో ప్రాణం పోయే వరకు వేచి చూస్తారా? అని ప్రజలు అధికారులను నిలదీస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే పరిస్థితులు ఏర్పడిన తర్వాత కూడా అధికారులు స్పందించకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత హడావుడిగా స్పందించడం కాదు.. ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడమే అధికారుల బాధ్యత అని స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బీ అధికారులు తాత్కాలిక మరమ్మతులతో చేతులు దులుపుకోకుండా, బ్రిడ్జిని పూర్తి స్థాయిలో పరిశీలించి నాణ్యమైన శాశ్వత మరమ్మతులు చేపట్టాలని, ఇరువైపులా రక్షణ ఏర్పాట్లు, డివైడర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని మండల ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. "ఇంకో ప్రాణం పోయే వరకు అధికారులు మేల్కొనరా?" అనే ప్రశ్న ప్రస్తుతం బోనకల్ ప్రజల నుంచి గట్టిగా వినిపిస్తోంది.

# చికెన్ వ్యర్థాల దందా.. నిఘా నిద్రపోతుందా?

(మొదటి పేజీ తరువాయి...)

ఉందని ప్రజలు అంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యర్థాలను రోడ్ల పక్కన పడేస్తే వారిపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులదేనని స్థానికులు గుర్తుచేస్తున్నారు.

**రహదారులే డంపింగ్ యార్డులా?**



ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే రహదారుల పక్కనే మాంసపు వ్యర్థాలు కనిపించడం గ్రామాల పారిశుద్ధ్య పరిస్థితిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. వ్యర్థాలు కుళ్లిపోవడంతో దుర్వాసన వస్తుండటంతో పాటు ఈగలు, కీటకాలు చేరుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇలాంటి ప్రదేశాలను అధికారులు గుర్తించి వెంటనే శుభ్రం చేయడంతో పాటు, మళ్లీ వ్యర్థాలు పడకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. చికెన్ దుకాణాల్లో వ్యర్థాల నిర్వహణపై అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నారా? నిర్వహిస్తే రోడ్ల పక్కన వ్యర్థాలు ఎలా పేరుకుపోతున్నాయి? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వస్తున్నాయి. మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులపై ప్రత్యేకంగా దృష్టి సారించి, చికెన్ షాపుల నిర్వాహకులకు వ్యర్థాల నిర్వహణపై స్పష్టమైన సూచనలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

**ఇకనైనా స్పందిస్తారా?**

ప్రజారోగ్యం, గ్రామాల పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్ల పక్కన ఉన్న చికెన్ వ్యర్థాలను తొలగించడంతో పాటు, భవిష్యత్తులో బహిరంగంగా వ్యర్థాలు పడేయకుండా పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. "సమస్య కనిపిస్తున్నా చర్యలు కనిపించకపోతే అధికారుల పర్యవేక్షణపై ప్రజల్లో అనుమానాలు రావడం సహజం. ఇకనైనా అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి పారిశుద్ధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి" అని స్థానికులు కోరుతున్నారు.

## సైన్స్ డ్రామా పోటీల బహుమతులను ప్రధానం చేసిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



(మొదటి పేజీ తరువాయి...)

ఉండాలని కోరుకుంటూ త్వరలో సైన్స్ సెమినార్ పోటీలు కూడా నిర్వహించబోతున్నాము ఈ సైన్స్ సెమినార్ పోటీలకు ఎక్కువ మంది పిల్లలు హాజరై వాళ్లలో శాస్త్రీయ దృక్పథాన్ని సైన్స్ పట్ల మక్కువను, చాటాలి అని తెలిపారు. సైన్స్ సెమినార్ – 2026 ను బెంగళూరులోని విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ & టెక్నాలజికల్ మ్యూజియం (VITM) వారు "Indian Energy Basket 2047: Prospects & Challenges" అనే అంశంపై నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా 8వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఉన్న ఉన్నత పాఠశాల విద్యార్థులకు జిల్లా మరియు రాష్ట్ర స్థాయి జాతీయస్థాయి లో సైన్స్ సెమినార్ నిర్వహించుట జరుగును అని తెలియజేశారు– విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ & టెక్నాలజికల్ మ్యూజియం (VITM), బెంగళూరు. వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు సైన్స్ సెమినార్ ఉద్దేశ్యం: యువ విద్యార్థులలో శాస్త్రీయ అన్వేషణా దృక్పథం, విశ్లేషణాత్మక ఆలోచనా విధానం మరియు శాస్త్రీయ స్ఫూర్తిని పెంపొందించడం ఈ సైన్స్ సెమినార్ ప్రధాన ఉద్దేశ్యం. జిల్లా, రాష్ట్ర మరియు జాతీయ స్థాయి పోటీ: జాతీయ స్థాయిలో పాల్గొనేందుకు రాష్ట్రంలో జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలలో సైన్స్ సెమినార్లు నిర్వహించబడతాయి. జిల్లా స్థాయి పోటీలలో విజేతలు రాష్ట్ర స్థాయి సెమినార్ లో పాల్గొంటారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన విద్యార్థులు జాతీయ స్థాయిలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తారు. అందువల్ల, సంబంధిత జిల్లాల్లో 8వ తరగతి నుండి 10వ తరగతి వరకు అన్ని యాజమాన్యాల (ప్రభుత్వ, ప్రైవేట్ తదితర) పాఠశాలల విద్యార్థులు ఈ సెమినార్ లో పాల్గొనేలా విస్తృత ప్రచారం నిర్వహించి, విద్యార్థుల భాగస్వామ్యాన్ని పెంపొందించాలని తెలిపారు.

## అధికారుల జవాబుదారీతనానికి ఆర్టీఐ అస్త్రం..!

(మొదటి పేజీ తరువాయి...)

ఆర్టీఐ కమిషనర్ పీవీ శ్రీనివాస్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా తమకు కల్పించిన సమాచార హక్కును పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. తిరుమలాయపాలెం మండలం జింకలగూడెం గ్రామాన్ని ఆర్టీఐ కమిషనర్ పీవీ శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా తన సహచరుడు, గ్రేటర్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్ సీఎండీ చైర్మన్ సయ్యద్ ఇమామ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలు పొందగలిగే సమాచారంపై అవగాహన కల్పించారు.

- **అభివృద్ధి పనులపై వివరాలు తెలుసుకోవచ్చు**

గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులకు ఎంత నిధులు మంజూరయ్యాయి, పనులు ఎప్పుడు ప్రారంభమయ్యాయి, ఎంతమేర పూర్తయ్యాయి, ఇప్పటివరకు ఎంత ఖర్చు చేశారు వంటి వివరాలను ప్రజలు సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకోవచ్చని పీవీ శ్రీనివాస్ తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, ప్రజా అవసరాల కోసం కేటాయించిన నిధులు తదితర అంశాలపై కూడా చట్టబద్ధంగా సమాచారాన్ని కోరవచ్చన్నారు.

**పారదర్శక పాలనకు ప్రజల భాగస్వామ్యం**

ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే ప్రతి పని ప్రజలకు జవాబుదారీగా ఉండేలా సమాచార హక్కు చట్టం దోహదపడుతుందని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలు తమకు అవసరమైన సమాచారాన్ని తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమాచారం



తెలుసుకోవడం కేవలం హక్కు మాత్రమే కాదని, ప్రజాస్వామ్యంలో చురుకైన పౌరుడిగా వ్యవహరించేందుకు అది ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు.

**ప్రశ్నించే పౌరుడే ప్రజాస్వామ్యానికి బలం**

గ్రామాల్లో ఆర్టీఐ చట్టంపై మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని పీవీ శ్రీనివాస్ తెలిపారు. ప్రజలు తమ హక్కులను తెలుసుకుని, అవసరమైన సందర్భాల్లో చట్టబద్ధమైన విధానంలో సమాచారాన్ని కోరాలని సూచించారు. "ప్రశ్నించండి..సమాచారం తెలుసుకోండి..మీ హక్కులను సద్వినియోగం చేసుకోండి" అనే సందేశాన్ని ఆయన గ్రామ ప్రజలకు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్ సీఎండీ చైర్మన్ సయ్యద్ ఇమామ్, మందడి వీరారెడ్డి, తెలంగాణ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మందడి ఇజ్రాయిల్, పి.సంజీవరెడ్డి, భాజ సత్యనారాయణ, నాగేందర్, గోల్ తండా సర్పంచ్ సుజాత–అనిల్ కుమార్, షేక్ మోహినుద్దీన్, ఎస్.డి. అజీమ్, ఎస్.డి. ఇమామ్, ఎస్.డి. సైదా, ఎస్.కె. కరీం, ఎస్.కె. మదర్, ఎస్.కె. లాల్ తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

(మొదటి పేజీ తరువాయి...)

ఆదివారము రోటరీ కమ్యూనిటి సెంటర్ నందు ఖమ్మం రోటరీ క్లబ్ అధ్యక్షులు శ్రీ హరి శ్రీనివాస్ అధ్యక్షతన విద్యా రంగములో విశేష సేవలు అందించిన అధ్యాపకులను మరియు ఉపాధ్యాయులను సన్మానించుట జరిగినది . ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిధిగా ఆసిస్టెంట్ ఆఫ్ కమిషనర్ పోలీస్ , సైబర్ క్రైమ్ , ఖమ్మం శ్రీ సి.హెచ్.ఆర్.వి. ఫణీందర్ హాజరయ్యారు . ఈ సందర్భంగా వారు అవార్డు పొందిన ఉపాధ్యాయులను , అధ్యాపకులను సన్మానించి అనంతరం సమాజంలో జరుగుతున్న అనేక రకములైన సైబర్ మోసముల వలన ప్రజలు ఏ విధంగా ఆర్థికంగా మరియు అనేక విధములుగా నష్టపోవుచున్నారో తమ ఉపన్యాసములో సోదాహరణముగా వివరిస్తూ , సైబర్ మోసముల నుండి ఎలా కాపాడుకోవాలో తెలిపారు . ఈనాటి ఈ సమావేశంలో రోటరీ క్లబ్ పి.డి. జి. మల్లాది వాసుదేవ్ , అసిస్టెంట్ గవర్నర్ కోటేరు వెంకటరెడ్డి , ప్రధాన కార్యదర్శి NVNSN ప్రసాద్ , కోశాధికారి CH రామకృష్ణ , రోటరీ ట్రస్ట్ బాధ్యులు డి. సాంబశివరావు , పసుమర్తి రంగారావు , ఐ. రామకృష్ణ , నల్లమోతు రవీంద్రనాథ్ , రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం సభ్యులు , సన్మానం పొందిన ఉపాధ్యాయులు , అధ్యాపకులు వారి బంధు మిత్రులు మరియు శ్రేయోభిలాషులు పాల్గొనినారు . ఈ కార్యక్రమంలో ఎన్. సీతారామిరెడ్డి , బి. చంద్రిక , కె. శ్రీనివాసరావు , టి. రామనుజాచార్యులు , జి. శ్రీదేవి, జి. సుగుణ , కె. విజయలక్ష్మి , బి. రామారావు , డి. ప్రమీల మరియు వి. వెంకటేశ్వర్లును మున్నగు ఉపాధ్యాయులను సన్మానించుట జరిగినది మరియు రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం సర్వీస్ కో ఆర్డినేటర్ పసుమర్తి రంగారావు రోటరీ క్లబ్ ఎంతో సేవలు చేసినందుకుగాను వారి దంపతులను కూడా ఆసిస్టెంట్ ఆఫ్ కమిషనర్ పోలీస్ ఫణేందర్ చేతుల మీదుగా సన్మానించడం జరిగింది .

## శ్రీ జ్ఞానోదయ స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం, బోనాలు వేడుకలు

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక శ్రీ జ్ఞానోదయ పబ్లిక్ స్కూల్‌లో సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం మరియు బోనాల వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం త్రీ టౌన్ ఎస్ఐ కొండలు , ప్రముఖ స్వచ్ఛంద సేవకురాలు ముకుంద ట్రస్ట్ చైర్మన్ రాజీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ కొండలు మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలోనూ, క్రమశిక్షణ గల పౌరులుగా రూపుదిద్దడంలోనూ ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని కొనియాడారు. సమాజంలో చట్టం, ధర్మం, న్యాయాలను కాపాడుతూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఉపాధ్యాయులను ముఖ్య అతిథులు పొన్నాడలు (బోకేలు), శాలువాలు, జ్ఞాపికలతో (షీల్డ్స్) ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి, గౌరవించడం అభినందనీయమని పేర్కొంటూ పాఠశాల ప్రిన్సిపాల్ ఉపేందర్ ని అతిథులు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం ముఖ్య అతిథులను మర్యాదపూర్వకంగా సత్కరించి, హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



# బీఆర్ఎస్ విమర్శలకు ప్రజలే సమాధానం చెబుతారు

- ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలే కాంగ్రెస్ పాలనకు నిదర్శనం
- బీఆర్ఎస్ నేతల తప్పుడు ప్రచారాన్ని ప్రజలు విశ్వసించరు
- మండల కాంగ్రెస్ నాయకుడు కట్కూరి శ్రీనివాస్ రెడ్డి



**తిరుమలాయపాలెం, ప్రజా జ్యోతి 6 :** కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి రాజకీయంగా ఎదుర్కోలేకనే బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండల కాంగ్రెస్ నాయకుడు కట్కూరి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు సంక్షేమ పథకాల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని పేర్కొన్నారు.ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజల్లోకి తీసుకెళ్లకుండా, లేనిపోని విమర్శలతో ప్రజలను అయోమయానికి గురిచేసే ప్రయత్నం చేయడం బీఆర్ఎస్ నాయకులకు అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. గత పాలనలో పరిష్కారం కాని అనేక సమస్యలపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టి పెట్టి ప్రజలకు మేలు చేసే చర్యలు చేపడుతోంద న్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో లబ్ధి పొందుతున్న ప్రజలకు వాస్తవ పరిస్థితులు స్పష్టంగా తెలుసని అన్నారు.బీఆర్ఎస్ నాయకులు గ్రామాల్లో ఎన్ని విమర్శలు, ఆరోపణలు చేసినా ప్రజలు వాటిని నమ్మే పరిస్థితి లేదని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రధాన ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను తిప్పికొట్టి రాబోయే రోజుల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని ఆయన పేర్కొన్నారు.

## ఘనంగా ముదిరాజ్‌ల వనభోజనాలు

- పాల్గొన్న టీడీపీ జిల్లా నాయకులు కొండబాల కరుణాకర్



**తిరుమలాయపాలెం, ప్రజా జ్యోతి, సెప్టెంబర్ 6.** మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో వనభోజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కుల పెద్దలు కొప్పెర జానకిరాములు, పోలెబోయిన ముత్తయ్యల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి టీడీపీ జిల్లా అడహక్ కమిటీ సభ్యులు, మాజీ ఇన్‌చార్జ్ కొండబాల కరుణాకర్ హాజరై ముదిరాజ్ సోదరులను అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా కుల సంఘ కార్యక్రమాలు నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. ముదిరాజ్ సమాజంలోని ఆర్థికంగా స్థోమత ఉన్నవారు పేదలకు సహాయసహకారాలు అందించాలని కోరారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్ణాటి అశ్వనీకుమార్, మల్లీడి నాగేశ్వరరావు, ఆళ్ల నరసింహారావు, మల్లీడి బాబురావు, సంఘం నాయకులు తురక వెంకన్న, వారా నాగరాజు, లింగంపల్లి సురేష్, సైదులు, లింగంపల్లి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుల నిరసనలు హాస్యస్పదం

- కాంగ్రెస్ గురించే మాట్లాడే అర్హత బీఆర్ఎస్ కు లేదు.
- మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు.



**నేలకొండపల్లి, ప్రజా జ్యోతి**,కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన పై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న నిరసన లు హాస్యస్పదంగా ఉన్నాయని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు పేర్కొన్నారు.మండలం లోని రాయగూడెం లో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలకు పీఎస్ఆర్ ట్రస్టు నుంచి రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం ను ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..పదేళ్లలో అభివృద్ధి చేయలేని బీఆర్ఎస్ నాయకులు రోడ్డెక్కి విమర్శలు చేయటం హాస్యస్పదంగా ఉందన్నారు. 1000 రోజుల పాలన లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హమీలు కూడ అమలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో దోచుకుని అప్పులు కూడ అమలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో దోచుకుని అప్పులు పాలు చేస్తే... వాటికి వడ్డీలు చెల్లించుకుంటూ... అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్ ను చూసి తట్టుకోలేకపోతున్నారన్నారు. మంత్రి శ్రీనివాసరెడ్డి అభివృద్ధి పనులతో పాటు, అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. పీఎస్ఆర్ ట్రస్టు ద్వారా అనేక మంది నిరుపేదలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోయిన వేణు, పార్టీ నాయకులు బోయిన నరసింహారావు, కోసూరి రాజబాబు, కోసూరు పానకాలు, బోయిన గురవయ్య, కోసూరి సత్యం, బోయిన హుస్సేన్, బోయిన కృష్ణయ్య, లక్ష్మీనారా యణ, బోయిన బ్రహ్మం, ప్రేమ్కుమార్, కాళంగి రాజీవ్‌గంధీ తదితరులు పాల్గొన్నారు.

## బోనమెత్తిన పల్లెలు



**నేలకొండపల్లి, సెప్టెంబర్ 6 ప్రజా జ్యోతి:**మండలం లోని వివిధ గ్రామాలలో ఆదివారం ముత్యాలమ్మ పండుగ సందర్భంగా బోనమెత్తారు. శ్రావణమాసం చివరి ఆదివారం కావటంతో ముత్యాలమ్మ పండుగ ను అత్యంత వైభవంగా నిర్వహించారు. డీజే పాటలతో, ఆటా, పాటలతో సందడి గా అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. నేలకొండపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి బోనమెత్తుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. మండలం లోని కోనాయిగూడెం, నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం, సుర్దేపల్లి తదితర గ్రామాలలో బోనాల సందడి కనిపించింది.

## హామీలేమయ్యాయి.. బాకీ కార్డులతో బీఆర్ఎస్ నిరసన

- ఎన్నికల హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది
- హస్నాబాద్‌లో కొవ్వూరి సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వినూత్న కార్యక్రమం
- ప్రజలకు 'కాంగ్రెస్ బాకీ కార్డులు' పంపిణీ
- ఇచ్చిన హామీలకు లెక్క చెప్పాలని డిమాండ్







**తిరుమలాయపాలెం ప్రజా జ్యోతి సెప్టెంబర్ 06:**ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ మండల నాయకులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఆదివారం హస్నాబాద్ గ్రామంలో బీఆర్ఎస్ మండల నాయకులు కొవ్వూరి సందీప్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ, ప్రజల వద్దకు వెళ్లి 'కాంగ్రెస్ బాకీ కార్డులు' అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన హామీలను ప్రజలకు గుర్తుచేస్తూ.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలు పరిస్థితి ఏమిటంటూ సందీప్ రెడ్డి ప్రశ్నించారు. హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని విమర్శిస్తూ ప్రజల దృష్టిని సమస్యలపైకి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.మహిళలు, రైతులు, యువత, నిరుద్యోగులు, విద్యార్థులు, వృద్ధులు, దివ్యాంగులు తదితర వర్గాలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో చెప్పిన మాటలకు, ప్రస్తుతం జరుగుతున్న పాలనకు మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనించాలని కోరారు.ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ప్రశ్నిస్తూనే ఉంటామని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని సందీప్ రెడ్డి పేర్కొన్నారు. హస్నాబాద్ గ్రామంలో చేపట్టిన 'బాకీ కార్డుల' కార్యక్రమం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలుపై ప్రజల్లో చర్చకు తీసుకురావడమే తమ ఉద్దేశమని. ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మోటపోతుల శ్రీనివాస్‌రావు, మాగి వెంకన్న, పల్లి గోపి, పల్లి వినోద్, కామ్మల్ల మహేంద్రనాథ్, పసలాది ఉపస్వామి, నూకల కృష్ణారెడ్డి, యాతాకుల నాగేశ్వరరావు, మాగి వెంకటేష్, పల్లి నవీన్, కోడి శివ, మాగి సతీష్, పల్లి అశోక్, మాగి నరేష్, పస్లాది నవీన్, మాగి లక్ష్మణ్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఉపాధి పథకంను సద్వినియోగం చేసుకోవాలి



**నేలకొండపల్లి, సెప్టెంబర్ 6 ప్రజా జ్యోతి:**ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని సుర్దేపల్లి పంచాయతీ సర్పంచ్ గరిడేపల్లి సుజాత సూచించారు. మండలం లోని సుర్దేపల్లి పంచాయతీ కార్యాలయం లో ఆదివారం 16 వ సోషల్ ఆడిట్ ఓపెన్ ఫోరమ్ గ్రామ సభ ను నిర్వహించారు. గ్రామంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించిన పనుల ను గ్రామ సభలో చదివి వినిపించారు. ప్రజలు పనుల పట్ల సంతృప్తిని వ్యక్తం చేస్తూ అమోదం తెలిపారు. పథకం ద్వారా జమాయిల్ మొక్కలు పెంపకం చేపట్టిన రైతులకు రూ.7,500 చొప్పున చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు... ప్రభుత్వాలు చేపడుతున్న పలు పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. అవసరమైన వారికి వెంటనే జాబ్ కార్డులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆర్. నాగేశ్వరరావు. ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ శైలజ, గ్రామ పెద్దలు గరిడేపల్లి రామారావు, తోళ్ల ఉపేందర్, దారమళ్ల పాపారావు, బండారుపల్లి వెంకటేశ్వరరావు, చ ట్టు వెంకటేశ్వర్లు, ఎర్రబోయిన కోటయ్య, షేక్ లాల్బాబా, షేక్ మున్నీవర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ వైద్యుడు బిరుదు రాజు వెంకట రాజు మృతి

- కుటుంబ సభ్యులను పరామర్శించిన తెలంగాణ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నాయకులు

**బోనకల్, సెప్టెంబర్ 6 (ప్రజా జ్యోతి):** తెలంగాణ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రావినూతల గ్రామ సీనియర్ గ్రామీణ వైద్యుడు బిరుదు రాజు వెంకట రాజు (80) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతిపట్ల తెలంగాణ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీడబ్ల్యూఏటీఎస్ జిల్లా అధ్యక్షుడు బొమ్మినేని కొండలరావు, జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు జేడీ మూర్తి, రాష్ట్ర కమిటీ సభ్యుడు గోపి, మండల కమిటీ సభ్యుడు అప్పారావు, బోనకల్ మండల కార్యదర్శి బాలు, మండల కోశాధికారి ఎస్కే. హసన్, ముస్లిం మైనార్టీ సంఘం అధ్యక్షుడు ఎస్కే. హసన్ తదితరులు రావినూతలలో వెంకటరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంకటరాజు మృతి గ్రామీణ వైద్య రంగానికి తీరని లోటని వారు పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరాజు సేవలను వారు స్మరించుకున్నారు.



## సింగరేణి జనరల్ మేనేజర్ వెంకటాచారిని కలిసిన ఐఎన్‌టీయూసీ నాయకులు



**సత్తుపల్లి సెప్టెంబర్ 06(ప్రజా జ్యోతి )**సత్తుపల్లి ఏరియా నూతన జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకటాచారిని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్, సత్తుపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ బి. కోటేశ్వరరావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీలో ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్,నూతన జనరల్ మేనేజర్ వెంకటాచారిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.సత్తుపల్లి ఏరియా అభివృద్ధి, ఉత్పత్తి–ఉత్పాదకతతో పాటు కార్మికుల సంక్షేమం, ఉద్యోగుల సమస్యల పరిష్కారం తదితర అంశాలపై నాయకులు జనరల్ మేనేజర్‌తో చర్చించారు. కార్మికుల సంక్షేమం, ఏరియా అభివృద్ధికి పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ సెక్రటరీలు నాగ ప్రకాష్, మురళీకృష్ణ, పిట్ సెక్రటరీలు షణ్ముఖచారి, నగేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## సురేంద్రనాథ్ మృతికి ఎమ్మెల్యే రాగమయి నివాళి



**సత్తుపల్లి సెప్టెంబర్06(ప్రజా జ్యోతి )**పట్టణంలోని గుడిపాడు రోడ్డుకు చెందిన ఎన్టీఆర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు వీర్ల సరోజిని వారి కుమారుడు దార్ల సురేంద్రనాథ్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందినారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ వారి స్వగ్రహానికి వెళ్లి, ఆయన పార్ధివ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతికి గల కారణాలు తెలుసుకొని కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని, సంతాపం వ్యక్తం చేశారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, పట్టణ అధ్యక్షుడు గాదే చెన్నారావు, కౌన్సిలర్లు తోట సుజలా రాణి, గ్రాండ్ మౌలాలి,కో ఆప్షన్స్ సభ్యులు ఫయాజ్,కాంగ్రెస్ నాయకులు దొడ్డా శ్రీనివాసరావు, గుండు ఉమా, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్లకు పోలీసుల కౌన్సిలింగ్

**వేంసూరు సెప్టెంబర్ 6 ప్రజాజ్యోతి** వేంసూరు మండల కేంద్రంలో ఇటీవల పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబడిన పలువురు వ్యక్తులకు వేంసూరు సబ్-ఇన్స్పెక్టర్ (SI) ఈరోజు పోలీస్



స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ ప్రదీప్ పేకాట మరియు ఇతర జూద క్రీడల వల్ల కుటుంబాలు ఎలా చిన్నాభిన్నమవుతాయో, సమాజంలో ఎలాంటి చెడు ప్రభావం పడుతుందో వారికి వివరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండి, మంచి జీవనం సాగించాలని వారికి హితవు పలికారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మండలంలో శాంతిభద్రతలను కాపాడేందుకు మరియు నేరాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని ఎస్ఐ తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

# ప్రభుత్వాలు విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించాలి

- **కమ్యూనిస్టులు ఐక్యమత్యంతో విజయాలు సాధించాలి**
- **తూము ప్రకాశరావు చిరస్మరణీయుడు**
- **బత్తినేని ఛారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం**
- **డిసిసిబి ఖమ్మం జిల్లా వైఎస్ ఛైర్మన్ ఉమ్మినేని కోటయ్య**



**బోనకల్, సెప్టెంబర్ 6 (ప్రజా జ్యోతి):** ప్రభుత్వాలు ఉచితాలు, ఆకర్షణ పథకాల కంటే నాణ్యమైన విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించాలని డిసిసిబి ఖమ్మం జిల్లా వైఎస్ ఛైర్మన్ ఉమ్మినేని కోటయ్య అన్నారు. అదివారం మండల కేంద్రంలోని తూము ప్రకాశరావు జ్ఞాపకార్థంగా బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ప్రకాశరావు భవన్లో 72వ ప్రత్యేక బిపి, షుగర్ క్యాంపు విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కమ్యూనిస్టు సీనియర్ నాయకులు రావెళ్ల జానకిరామయ్య, తమ్మారపు గోవిందు, తూము ప్రకాశరావు, కొంగర అప్పయ్య, ఏడునూతల కృష్ణమూర్తి, చుండూరు నరసింహారావు, తమ్మారపు మస్తాన్, తమ్మారపు భద్రయ్య, నల్లమోతు పిక్చయ్య, వెంపటి సాంబయ్య, వాసిరెడ్డి వెంకటపతి, కొంగర రామయ్యలతో కలిసి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో కలిసి పని చేశారన్నారు. నేటి మధిర ప్రాంత అభివృద్ధి వెనుక ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమాల త్యాగగాథ దాగి ఉందన్నారు. కమ్యూనిస్టుల ఐక్యమత్యంతో అనేక విజయాలు సాధించిన ఘనత ఉందని పేర్కొన్నారు. తూము ప్రకాశరావు జీవితం ప్రజా ఉద్యమాలకు ఆదర్శమని కొనియాడారు. తూము ప్రకాశరావు అమరత్వానికి 43 సంవత్సరాలు పూర్తవుతున్న ప్రజల గుండెల్లో ఆయనకు చెరగని స్థానం ఉండటం ఆయన చేసిన సేవలకు నిదర్శమని అన్నారు. భవిష్యత్ తరాలు ఎదగాలంటే విద్య కావాలి, ప్రస్తుత తరం నడవాలంటే వైద్యం కావాలని అటు వైపుగా ప్రభుత్వాలు ఉచితాలు ఇచ్చేలా రాజకీయ పార్టీలు పోరాడాలన్నారు. ఆరోగ్య శ్రీలో 1500 జబ్బులకు వైద్య సేవలందిస్తున్నామని చెప్పే ప్రభుత్వాలు, మోకాళ్ల చిప్పల మార్పిడి, క్యాన్సర్ వంటి జబ్బులను ఆరోగ్య శ్రీలో చేర్చాలని కోరారు. ఇవి రాజకీయాలు కావు అని మన శ్రేయస్సు కోసం, మన భవిష్యత్ కోసం ప్రభుత్వాలపై, రాజకీయ పార్టీలు ఒత్తిళ్లు తీసుకురావాలని కోరారు. మనం ఏ రాజకీయ పార్టీలో పనిచేసిన ప్రభుత్వాలు ప్రజలకు కల్పించాల్సిన మౌళిక విషయాలు ఏమైఉన్నాయో అవి సాధించుకునేందుకు పోరాటాలు చేయాలని కోరారు. పేషంట్లు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ బిపీ, షుగర్ పత్యేక క్యాంపులు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. సామాజిక స్పృహతో పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్న చారిటబుల్ ట్రస్ట్ సేవలను కొనియాడారు. ఈ క్యాంపులో 100 మందికి పేషంట్లకు ప్రముఖ బిపి, షుగర్, జనరల్ వైద్యులు టి పవన్ కుమార్ పరీక్షించి వైద్యసేవలు అందించారు. ముందుగా ఉమ్మినేని కోటయ్య చేతుల మీదుగా పేషంట్లకు మందుల పంపిణీ చేశారు. సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, ఆర్ఎంపీడబ్ల్యూఏటిఎస్ జిల్లా అధ్యక్షులు బొమ్మినేని కొండలరావులు క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు ఆకెన పవన్, మాతంగి శ్రీనివాసరావు, యంగల గిరి, జానకీపురం మాజీ సర్పంచ్ చిలకా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మాముసూరు టూరిజం పనుల పరిశీలన



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల పరిధిలోని మామునూరు పేట చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేయుటకు తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సుమారు 4-86 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాగ సంబంధిత పనులను ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు ఏఈ నరేష్‌తో కలిసి నిర్మాణపనులను ఆదివారం పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులు త్వరితిగతిన పూర్తి చేయాలని,క్వాలిటీ విషయంలో రాజీ పడకుండా ఉండాలని చూసించారు. ఈ కార్యక్రమంలో మామునూరు సర్పంచ్ షేక్ పెదబాబు సాహెబ్,పాశం రవి, లక్కిరెడ్డి అయ్యపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు లాభాలు

**ఖమ్మంప్రతినిధి: (ప్రజాజ్యోతి )ఖమ్మం అర్బన్, సెప్టెంబరు 6:** ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు ఆయిల్‌పామ్ సాగు అన్ని విధాలా ప్రయోజనకరంగా ఉంటుందని ఉద్యాన అధికారి జి.నాగేష్ అన్నారు. ఖమ్మం అర్బన్ మండలం రామన్నపేట గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా రైతులకు ఆయిల్‌పామ్ సాగు విధానం, మొక్కల పెంపకం, తోటల నిర్వహణ, నీటి వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సంప్రదాయ పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్‌కు మార్కెట్ అవకాశాలు, దీర్ఘకాలిక ఆదాయం ఉండటంతో రైతులు సాగుపై దృష్టి సారించాలని సూచించారు.కార్యక్రమంలో గోద్రెజ్ జిల్లా మేనేజర్ రామకృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఆయిల్‌పామ్ రైతులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ నిరసనలు.. ప్రజలను మభ్య పెట్టే రాజకీయ డ్రామాలే!

- **సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి బాటలు**
- **మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పాలేరు నియోజకవర్గంలో అభివృద్ధికి పెద్దపీట**
- **సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం**



**తిరుమలాయపాలెం,ప్రజా జ్యోతి సెప్టెంబర్ 6:**బీఆర్ఎస్ నాయకులు చేపడుతున్న నిరసనలు, ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు రాజకీయ డ్రామాలేనని మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు లంజపల్లి శ్రీనివాస్ విమర్శించారు. ప్రజలకు వాస్తవాలు తెలుసని, పదేపదే విమర్శలు చేసినంత మాత్రాన ప్రజల అభిప్రాయాలను మార్చలేరని అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పాలేరు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని శ్రీనివాస్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు అర్హులైన వారికి సంక్షే మ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పాలేరు ని యోజకవర్గ అభివృద్ధికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారని అన్నారు.అదేవిధంగా పీఎస్ఆర్ ట్రస్టు ద్వారా పేద, నిరుపేద కుటుంబాలకు అందుతున్న ఆర్థిక సహాయం ఎంతోమందికి అండగా నిలుస్తోందని శ్రీనివాస్ తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తూ సామాజిక బాధ్యతను నిర్వర్తించడం అభినందనీయమన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని, వాస్తవాలను తెలుసుకున్న ప్రజలు బీఆర్ఎస్ రాజకీయ ఆరోపణలను ఇక పట్టించుకునే పరిస్థితిలో లేరని లంజపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# జీవనశైలితో.. పోరాటం



- ఒకప్పుడు స్వచ్ఛమైన ఆహారం.. నేడు విషతుల్యమైన ఆహారం
- కష్టార్జితమంతా.. ఆరోగ్యాన్ని కొనుక్కోవడానికేనా?
- గుడ్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోట పుల్లయ్య

**కల్లూరు, సెప్టెంబర్ 06: ప్రజా జ్యోతి** ఒకప్పుడు ప్రకృతి ఆధారిత పద్ధతుల్లో పండించిన పంటలు, ఇంటి వంటకాలు, చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, సీజనల్ పండ్లతో ప్రజల జీవనం ఆరోగ్యంగా ఉండేదని.. ప్రస్తుతం ఆధునిక జీవనశైలి, రసాయనాల వినియోగం, ప్రాసెస్డ్ ఫుడ్, శారీరక శ్రమ తగ్గిపోవడంతో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని గుడ్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోట పుల్లయ్య అన్నారు.ప్రస్తుత పరిస్థితులపై ఆయన మాట్లాడుతూ.. మన పూర్వీకులు ఏం తిన్నారు? మనం ఏం తింటున్నాం? అనే విషయాన్ని ఒక్కసారి ఆలోచిస్తే మార్పింటో అర్థమవుతుందన్నారు. వ్యవసాయం వ్యాపారంగా మారడంతో అధిక దిగుబడుల కోసం రసాయనాల వినియోగం పెరిగిందన్నారు. మరోవైపు ప్యాకేజ్డ్, ప్రాసెస్డ్ ఫుడ్, అధిక చక్కెర, ఉప్పు, కొవ్వు కలిగిన ఆహారంతో పాటు శారీరక శ్రమ తగ్గడం, నిద్రలేమి, ఒత్తిడి అనారోగ్యానికి కారణమవుతున్నాయని పేర్కొన్నారు.వ్యాధి వచ్చిన తర్వాత పరుగులు ఎందుకు?ఆరోగ్యం దెబ్బతిన్న తర్వాత ఆసుపత్రుల చుట్టూ తిరగడం కంటే.. ముందుగానే జీవనశైలిని మార్చుకోవడం ముఖ్యమన్నారు. స్థానికంగా లభించే తాజా ఆహారం, ఇంటి వంట, నిత్య వ్యాయామం, తగినంత నిద్ర, మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. "మనం నేలను కాపాడితే.. నేల మనల్ని కాపాడుతుంది. స్వచ్ఛమైన ఆహారం ఆరోగ్యానికి రక్షణ. ఆరోగ్యాన్ని ఆసుపత్రిలో మాత్రమే కాదు.. మన వంటగదిలో, మన రోజువారీ అలవాట్లలో కాపాడుకోవాలని అన్నారు. ఆధునిక జీవనశైలిని పూర్తిగా వదిలేయడం సాధ్యం కాకపోయినా.. అందులో ఆరోగ్యకరమైన అలవాట్లను భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. డబ్బు పోతే తిరిగి సంపాదించుకోవచ్చు.. కానీ కోల్పోయిన ఆరోగ్యాన్ని పూర్తిగా తిరిగి పొందడం ఎల్లప్పుడూ సాధ్యం కాదు. అందుకే వ్యాధితో పోరాడే ముందు.. మన జీవనశైలితో పోరాడాలని అన్నారు. భవిష్యత్తులో ట్రస్ట్ చేపట్టే కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు.

## వేంసూరు తెలంగాణ ఉద్యమకారుల కమిటీ ఏర్పాటు



**వేంసూరు సెప్టెంబర్ 6 ప్రజాజ్యోతి** తెలంగాణ ఇచ్చింది సోనియా గాంధీ మాత్రమే నని తెలంగాణ జన సమితి రాష్ట్ర కార్యదర్శి గోపగాని శంకర్రావు అన్నారు. వేంసూరులో తెలంగాణ తొలిఉద్యమకారుడు మోరంపూడి చంద్రశేఖర రావు ఇంటివద్ద ఆదివారం నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత పదేళ్లుగా టిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను పట్టించుకోలేదని వారికి పింఛన్లు ఇళ్ల స్థలాలు నిరుద్యోగ భృతి ఇస్తామని మాట తప్పేరన్నారు కెసిఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వాగ్దానాలు తుంగలో తొక్కారని అన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల హామీ ప్రకారం తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తా మన్నారు అందుకోసమే తెలంగాణ ఉద్యమకారులు మండల కమిటీలు ఏర్పాటు చేసుకొని ఈనెల 11 నుంచి ప్రభుత్వానికి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా గోపగాని శంకర్రావు కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారులకు మంచి జరుగుతుందని ఆశిద్దాం అన్నారు ఈ కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు మాదాసు శ్రీనివాసరావు, జిల్లా నాయకులు బట్టు రాజేందర్ నాయక్,నాగేశ్వరరావు, మోరంపూడి చంద్రశేఖర్, అజయ్ ఘోష్, మిర్యాల రవి, కొమ్మినపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఉద్యమకారుల మండల కమిటీ ఎంపిక తెలంగాణ ఉద్యమకారుల మండల కమిటీ అధ్యక్షుడిగా మేడ విజయబాబు,ప్రధాన కార్యదర్శిగా గండ్ర జగన్ మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా రేగళ్ల రామిరెడ్డి,కంటే రామకృష్ణ, కార్యదర్శిగా గౌడెల్లి మోహనరావు, కోశాధికారిగా బాల్ద చెన్నకేశవులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## అంగరంగ వైభవంగా ముత్యాలమ్మ బోనాల జాతర వేడుకలు







**పాలేరు ఆర్.సీ సెప్టెంబర్ 06 ప్రజా జ్యోతి** కూసుమంచి మండలంలోని జీళ్ళచెరువు గ్రామపంచాయతీలో గ్రామ పెద్ద గౌడ్ అంబాల లింగయ్య ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ ప్రజలు శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ముత్యాలమ్మకు పసుపు కుంకుమ చీర శారలతో ఘనంగా బోనమెత్తి భక్తులు మొక్కలు చెల్లించుకున్నారు. దీంతో ముత్యాలమ్మ దేవాలయంలో భక్తుల సందడి వాతావరణ నెలకొంది. వర్షాలు సమృద్ధిగా కురిచి రైతాంగ సమస్త ప్రజానీకం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఎటువంటి అంటూ వ్యాధులు ప్రబలకుండా గ్రామాన్ని చల్లగా చూడాలని మొక్కులు చెల్లించి గ్రామదేవతలను ముత్యాలమును వేడుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి దర్శించుకున్నామని పలువురు భక్తులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో జీళ్ళ చెరువు గ్రామ ప్రజలు మహిళలు, యువకులు, ఘనం గా ముత్యాలమ్మ జాతర బోనాల వేడుకలలో పాల్గొన్నారు.

## కల్లూరు జామియా మసీదు లో బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ



**కల్లూరు, సెప్టెంబర్ 06: ప్రజా జ్యోతి** ముస్లింల ఐక్య సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12న కొత్తగూడెం లోని క్లబ్ సమీపంలో మగ్రిబ్ నమాజ్ అనంతరం జిల్లా స్థాయి రెండవ భారీ బహిరంగ సభ నిర్వహించినట్లు కల్లూరు మండల సదర్ ఎండి హనీఫ్ మసీదు కమిటీ సదర్ సయ్యద్, రవూఫ్, సయ్యద్ అలీ, ఎస్ డి అమీరుద్దీన్ ,ఎస్ కె సిరాజుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం కల్లూరులోని జామియా మసీదులో బహిరంగ సభ పోస్టర్ ను ఆవిష్కరించారు. మహమ్మద్ సందేశం అంశంపై నిర్వహించే ఈ సభకు ఉత్తరప్రదేశ్ కు చెందిన హజరత్ అగ్దస్ మౌలానా మహమ్మద్ సల్మాన్ జిజోర్ని నక్సబందీ సాహెబ్ ఢిల్లీకి చెందిన డాక్టర్ హఫీజ్ ఉర్ రెహమాన్ సాహెబ్, హిందూ – ముస్లిం జన ఏకతా మంచ్ కాన్పూర్ చెందిన స్వామి లక్ష్మీ శంకరాచార్యులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. హిందూ ముస్లిం క్రైస్తవులతోపాటు అన్ని సామాజిక వర్గాల ప్రజల అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ ముజాయిద్, షేక్ ఖాలీద్, ఎస్ డి బాబా, గౌస్, షేక్ ఇర్ఫాన్, ఎస్ డి జావిద్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతలకు డాక్టర్ మట్టా పరామర్శ



**కల్లూరు, సెప్టెంబర్ 06 : ప్రజా జ్యోతి** అనారోగ్యంతో బాధపడుతున్న కల్లూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉస్మాన్ ఆలీని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఆదివారం పరామర్శించారు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అభిమానులతో కలిసి ఉస్మాన్ నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా కల్లూరు పట్టణ మాజీ సదర్ షేక్ ఇమామ్ ను కూడా డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్ ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ చౌదరి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆళ్ళకుంట నరసింహారావు, తురాబ్ ఆలీ, వార్డు కౌన్సిలర్లు, పట్టణ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం

- 800 మందికి కంటి పరీక్షలు.. 180 మందికి శస్త్ర చికిత్సల గుర్తింపు

**కల్లూరు, సెప్టెంబర్ 06: ప్రజా జ్యోతి** శ్రీ షిరిడీ సాయి రామ ధ్యాన మందిరం, కల్లూరు–పెనుబల్లి వారి ఆధ్వర్యంలో కాకినాడ శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి నిర్వహణలో ఆదివారం కల్లూరు పి ఎం ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ ప్రారంభించారు. శిబిరంలో సుమారు 800 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 180 మందికి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు.నేత్ర వైద్య నిపుణులు కె.హరిబాబు,ఆఫ్రిద్ తదితరులు కంటి పరీక్షలు నిర్వహించి, రోగులకు వైద్య సలహాలు అందించారు.శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించిన 180 మందికి ఈనెల20, 23,27 తారీకుల్లో కాకినాడలో శస్త్రచికిత్సలు జరుగుతాయని నిర్వాహకులు వివరాలు అందించారు.ఈ కార్యక్రమంలోకార్యదర్శి కొప్పరపు బలరామ్, పి.ఆర్.ఓ మోటూరి శివప్రసాద్, సత్యనారాయణ,నిర్వాహకులు జన్నారెడ్డి నరసింహారెడ్డి,ట్రెజరర్ బాలాజీ,సీఐటీయూ నాయకులు తన్నీరు కృష్ణార్జునరావు,రాచమల్ల నాగేశ్వరరావు,కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కే. సిరాజుద్దీన్, శ్రీనివాసరావు, రాజు,యాస శ్రీకాంత్,జిల్లెల్ల కృష్ణారెడ్డి,పీఎం ఎస్ హై స్కూల్ వీర రాఘవయ్య,విద్యార్థులు వాలంటీర్లుగా సత్తుపల్లి కాకతీయ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, కల్లూరు మండల పదిమంది టీచర్లు రిజిస్ట్రేషన్ కమిటీ సభ్యులుగా,కాకినాడ శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి సిబ్బంది పాల్గొని శిబిరం విజయవంతానికి సహకరించారు.

